సాక్షి
నిర్మల్

ఆదివారం । 6 । జూలై । 2025



రథంపై కొలువుదీరిన జగన్నాథుడు

న్యూస్‌రీల్

‘తుమ్మల’ను కలిసిన నాయకులు


తుమ్మల నాగేశ్వర్‌రావుతో నాయకులు

కుభీర్: వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కుభీర్ మార్కెట్ చైర్మన్ జి.కళ్యాణ్, మాజీ సర్పంచ్ విజయ్, నాయకులు సాయినాథ్ శనివారం సచివాలయంలో కలిశారు. మండలంలోని రైతులకు చాలినంత యూరియా, డీఏపీ సరఫరా చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు వేణుగోపాలచారి, జి.విఠల్‌రెడ్డి వీరిని మంత్రి వద్దకు తీసుకెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్


సిబ్బందితో మాట్లాడుతున్న రాజేందర్

కుంటాల: సీజనల్ వ్యాధులపై ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ సూచించారు. కుంటాల పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. పీహెచ్‌సీ పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని అప్పగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వర్షాకాలంలో తీసుకునే ఆహారం, నీరు కలుషితం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని అన్నారు. టైఫాయిడ్, మలేరియా ప్రబలే అవకాశాలు ఉన్నందున గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పీఆర్ ఈఈ చందుజాదవ్, డీఈ వేణుగోపాల్, ఎంపీడీవో లింబాద్రి, వైద్యురాలు శృతిరెడ్డి, పీఆర్ ఏఈ గౌరీశ్ తదితరులు ఉన్నారు.

డీసీఎస్‌వోగా రాజేందర్


స్వాగతం పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: పెద్దపల్లి డీసీఎస్‌వోగా విధులు నిర్వహించిన బి.రాజేందర్ నిర్మల్ డీసీఎస్‌వోగా బదిలీపై వచ్చారు. శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ డీసీఎస్‌వోగా పనిచేసిన టి.కిరణ్‌కుమార్ జయశంకర్ భూపాలపల్లికి బదిలీ అయ్యారు.

పీయూసీ-2 విద్యార్థుల ఓరియంటేషన్


కార్యక్రమంలో ప్రొఫెసర్ గోవర్ధన్, అధికారులు

బాసర: జిల్లాలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) బాసరలో అకడమిక్ విభాగం ఆధ్వర్యంలో పీయూసీ-2 విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ విద్యావిధానం, వనరులు, నైతిక విలువలు, సాంకేతిక విద్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ, జ్ఞానం వ్యక్తిత్వాన్ని రూపుదిద్దే ప్రధాన సాధనమన్నారు. “మీరు పొందే ప్రతీ అంశాన్ని లోతుగా అర్థం చేసుకుని, జ్ఞానం ద్వారా భవిష్యత్‌ను నిర్మించుకోవాలి,” అని సూచించారు. విశ్వవిద్యాలయంలో డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, సాంస్కృతిక, క్రీడా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. త్వరలో విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేస్తామని చెప్పారు. విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం సెల్ఫ్ స్టడీ గంటల్లో అధ్యాపకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్ చార్ట్‌లు, వ్యవహార ఆంగ్ల పదజాల నమూనాలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. అకడమిక్ క్యాలెండర్‌ను కచ్చితంగా పాటించాలని, పరీక్షల నమూనా గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయం వృథా చేయకుండా, లక్ష్యాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఆరేళ్ల సమగ్ర విద్యా విధానాన్ని సద్వినియోగం చేసుకుని జ్ఞానంతోపాటు నైపుణ్యం సంపాదించి, ఉద్యోగులుగా మాత్రమే కాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సందేహాల నివృత్తికి ఇంటరాక్షన్ ఏర్పాటు చేశారు. అసోసియేట్ డీన్లు విఠల్, మహేశ్, చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


మురళీకృష్ణ ఆలయం వద్ద జగన్నాథ రథాన్ని లాగుతున్న భక్తులు

జై జగన్నాథ్..

నిర్మల్ జిల్లా కేంద్రంలో ‘జై జగన్నాథ్.. జై జై పూరీ జగన్నాథ్.. హరే రామ.. హరే కృష్ణ.. కృష్ణ కృష్ణ హరే హరే..’ అంటూ జగన్నాథ రథయాత్ర శనివారం ఉత్సాహంగా సాగింది. భక్తిభావం ఉప్పొంగింది. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) హరే కృష్ణ మందిర ట్రస్ట్, నిర్మల్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. స్థానిక గాంధీ చౌక్‌లోని మురళీకృష్ణ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర, పురవీధుల గుండా బస్టాండ్ వరకు సాగింది. అక్కడి నుంచి తిరిగి ఆలయానికి చేరుకుంది. భక్తులు తన్మయత్వంతో రథాన్ని లాగారు. హరినామ సంకీర్తనలతో వీధులను మార్మోగించారు. రథయాత్రలో పట్టణ వాసులు, ఇస్కాన్ భక్తులు హరినామ సంకీర్తనలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవచనాలు, 56 రకాల భోగ నివేదనలతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రథం ముందు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రంగతీర్థదాస్, సామనపల్లి రాఘవులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. – నిర్మల్‌టౌన్


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, కళాకారులు


రథం ముందు చిన్నారుల నృత్య ప్రదర్శన

ఊరంతా భక్తిభావం!

- తాండ్ర(జి) గ్రామం.. మొహర్రం ప్రత్యేకం
- హస్సేన్, హుస్సేన్ నినాదాలు, పీరీల సందడి
- అలాయ్ బలాయ్‌తో ముగింపు


తాండ్ర గ్రామంలో ప్రతిష్ఠించిన పీరీలు

సారంగపూర్: మొహర్రం.. ముస్లింలు త్యాగాలకు ప్రతీకంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే వేడుక. కొన్నిచోట్ల తొమ్మిది రోజులు, కొన్నిచోట్ల ఆరు రోజులు, ఐదు రోజులు, మూడు రోజులు జరుపుకుంటారు. అయితే మతాలకు అతీతంగా తెలంగాణలో మొహర్రం జరుపుకుంటారు. హిందువులే ఎక్కువగా పూజిస్తారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం తాండ్ర(జి)లో మతసామరస్యంగా, ప్రత్యేకంగా మొహర్రం జరుపుకుంటారు. పీరీలను నిలిపి.. ఆరు రోజుల పాటు ప్రత్యేక ఆచారాలతో మొహర్రం జరుపుకుంటారు. పీరీల శోభాయాత్రలు, మలీద ముద్దలు, అగ్నిగుండం ప్రవేశాలు ప్రజలను భక్తితో కట్టిపడేస్తాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రుయ్యాడి తర్వాత తాండ్ర(జి) గ్రామంలోనే ఈ పండుగను పెద్ద ఎత్తున జరుపుకుంటారు. గ్రామస్తులంతా ఒక్కటై పీరీల పండుగలో పాల్గొనడం, అగ్నిగుండం దాటడం ఇక్కడి ఆనవాయితీ.

గుండం చుట్టూ ప్రదక్షిణలతో ఆరంభం..

తాండ్ర(జి) గ్రామ నడిబొడ్డున ఉన్న పీరీల ఆలయం ఎదుట అగ్నిగుండం ఏర్పాటు చేస్తారు. పండుగ రోజు గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం ఆరు పీరీలు మౌలాలి, హిమాకత్మే, కర్బలా, నాన్‌సాబ్, దీన్‌సవార్, మొహ్మద్ అలీ సవారీలను సిద్ధం చేస్తారు. ఈ పీరీలను శోభాయాత్రగా గ్రామ సమీపంలోని దర్గాకు తీసుకెళ్లి, అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దర్గా వద్ద ఉన్న చెలిమ నీటితో పీరీలను శుభ్రం చేసి, మౌలాలి, ఆయన సతీమణి బీమ్‌ఫాతిమాల దర్గాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు.

ఆరు రోజుల ఆచారాలు..

పీరీల పండుగను ఆరు రోజులపాటు విభిన్న ఆచారాలతో జరుపుకుంటారు. మొదటిరోజు తొలుతా సవార్, రెండు, మూడో రోజు నడిమ సవార్, నాలుగోరోజు మలీదలు, ఐదో రోజు కర్బలా సవార్, చివరి రోజు అగ్నిగుండం ప్రవేశం, అలాయ్-బలాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఆచారాలు గ్రామస్తుల ఐక్యతను, భక్తిని ప్రతిబింబిస్తాయి.

గ్రామంలో పండుగ చరిత్ర..

తాండ్ర(జి) గ్రామంలో పీరీల పండుగకు అనాదిగా వస్తున్న ఆచారం వెనుక ఒక చరిత్ర ఉంది. కొన్నేళ్ల క్రితం గ్రామంలో ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, గ్రామానికి చెందిన దూదేకుల అన్నుసాబ్ అనే వ్యక్తికి పూనకం వచ్చి, పీరీల పండుగ జరపాలని సూచించినట్లు చెప్పారట. గ్రామ సమీపంలోని చెలిమ వద్ద బీమ్‌ఫాతిమా, మౌలాలి అడుగుపెట్టిన దాఖలాలు ఉన్నాయని, అక్కడ నీటి ఊటలు బయటకు వస్తున్నట్లు తెలిపారట. దీంతో అన్నుసాబ్ పూర్వీకుల సూచనల మేరకు పీరీల పండుగను నిర్వహించగా, గ్రామస్తుల అనారోగ్య సమస్యలు తీరి, ఆరోగ్యం కుదుటపడినట్లు చెబుతారు. అప్పటి నుంచిఈ పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకుంటున్నారు.

పేండ్‌పల్లిలో ప్రత్యేకం..


పేండ్‌పల్లిలో పీరీలు

భైంసా: జిల్లాలో మొహర్రం వేడుకలు జరిగే గ్రామాల్లో పేండ్‌పల్లి ఒకటి. భైంసా మండలం మహాగాం, ఇలేగాం గ్రామాల్లోనూ ఈ వేడుకలు జరుగుతాయి. పేండ్‌పల్లి గ్రామంలో గుండం, ఆటలు, సవార్లకు మలీదలు సమర్పించడం చేస్తారు. ఆదివారంతో వేడుకలు ముగియనున్నాయి. మొక్కులు తీర్చుకోవడంలో హిందూ, ముస్లింలు భక్తి శ్రద్ధలతో నియమాలు పాటిస్తారు. డప్పువాయిద్యాల నడుమ హసేన్, హుస్సేన్‌లతోపాటు పీరీల ఊరేగింపులో స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే భక్తులు పాల్గొంటారు. మతాలకు అతీతంగా ఇక్కడ మొహర్రం జరుపుకుంటారు. పీరీల పండుగ సంస్కృతి కొన్నేళ్లుగా కొనసాగుతుంది.

జరుపకపోతే అనర్థమే..


గ్రామంలో పీరీల పండుగ జరుపకపోతే ఏదైనా అనర్థం జరుగుతుందని మాపూర్వీకులు తెలిపారు. అందుకే యేటా పెద్ద ఎత్తున పీరీల పండుగ జరుపుకుంటాం. గ్రామం నుంచి పండుగ నిర్వహణకు పెద్దమొత్తంలో ఖర్చు చేస్తాం. వేడుకలు చూడడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.
– పెద్ద గంగన్న, తాండ్ర(జి)

తాతల కాలం నుంచి..


మాతాత గారు, మా నాన్నగారు అన్నుసాబ్ కాలం నుంచి నేటి వరకు పీరీల పండుగ వారు సూచించిన పద్ధతిలో నిర్వహిస్తున్నాం. మా తాతగారి అనంతరం మా నాన్నగారు. మా నాన్నగారి తర్వాత నాకు పూనకం వ స్తుంది. ఇదే ఆనవాయితీ నేటికీ కొనసాగిస్తున్నాం.
– మినాజ్, అన్నుసాబ్ వారసుడు

ఆరు రోజులు ఉపవాస దీక్ష


గ్రామంలో మొహర్రం ప్రారంభమైన నాటినుంచి ఆరురోజులపాటు ఉపవాస దీక్ష చేసి మొహర్రం వేడుకల్లో పాల్గొంటాం. ఎక్కడికి వెళ్లి వచ్చినా స్నానం చేశాకే ఆలయంలోకి ప్రవేశిస్తాం. నిష్ఠగా ఆరురోజులు పీరీల పండుగ జరుపుకుని చివరిరోజు అలాయ్ బలాయ్‌తో కార్యక్రమాన్ని ముగిస్తాం.
– సాయవ్వ, తాండ్ర(జి)

జిల్లాలో ఘనంగా ప్రారంభం..


షేక్ సాహెబ్ పేటలో కొలువుదీరిన పెద్ద మౌలాలి పీరి

నిర్మల్‌చైన్‌గేట్: మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమాం హుస్సేన్ బలిదానాన్ని స్మరిస్తూ, ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెలైన మొహర్రం నెలలో పది రోజులపాటు పవిత్ర దినాలుగా భావిస్తూ మొహర్రం పర్వదినాన్ని నిర్వహిస్తారు. జిల్లాలో ఈ ఉత్సవాలు పెద్ద ఎత్తున ప్రారంభమయ్యాయి. ఈ పర్వదినాన్ని త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటూ, హిందూ–ముస్లిం సమాజాలు కలిసి సౌభ్రాతృత్వ భావంతో ఈ వేడుకల్లో పాల్గొంటున్నాయి.

హిందూ–ముస్లిం సమైక్యత..

పూర్వకాలం నుంచి హిందూ, ముస్లిం సమాజాలు కులమత భేదాలకు అతీతంగా మొహర్రం పర్వదినాన్ని సంయుక్తంగా జరుపుకుంటున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఈ ఉత్సవం ఏడురోజులు జరుగుతుంది. హిందూ, ముస్లిం భక్తులు పీరీలకు పూజలు చేస్తారు. ముస్లిం పర్వదినాల్లో హిందువులు ఇంత పెద్ద ఎత్తున పాల్గొనడం మొహర్రం ప్రత్యేకతగా నిలుస్తుంది.

నిర్మల్ పట్టణంలో 40కి పైగా పీరీలు..

నిర్మల్ పట్టణంలోని పంజేషా గల్లీలోని ‘పెద్ద పంజా’తో సహా సుమారు 40కి పైగా పీర్లను ఆయా వీధుల్లో ప్రతిష్ఠించి, భక్తి శ్రద్ధలతో సంప్రదాయ పద్ధతిలో ఊరేగిస్తారు. పంజేషా గల్లీలో పెద్ద పంజా, పెద్ద నాల్ సాహెబ్, ఈద్గాలో నాల్ సాహెబ్, చిన్న నాల్ సాహెబ్, ఖస్బా ప్రాంతంలో మొహమ్మద్ హనీఫ్, శేఖ్ సాహెబ్ పేటలో పెద్ద హజరత్ మౌలాలి, వెంకటాద్రి పేటలో హజరత్ మొహమ్మద్ హనీఫ్, బెస్తవారిపేటలో ఇమామే ఖాసిం, బంగల్ పేటలో హజరత్ అలీ అబ్బాస్, కబూతర్ కమాన్‌లో హజరత్ అలీ అక్బర్, బుధవార్ పేటలో హజరత్ అలీ అబ్బాస్, గాజులపేటలో మొహమ్మద్ హనీఫ్ వంటి పీరీలను ప్రతిష్ఠించి పది రోజులు మతాలకు అతీతంగా ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ నెల 7న నిర్మల్‌లో మొహర్రం ముగుస్తుందని పెద్దపంజా, పెద్ద నాల్ సాహెబ్ మొహర్రం నిర్వహణ కమిటీ బాధ్యులు మిర్జా అఫ్సర్ బేగ్ తెలిపారు.

పెద్ద మౌలాలికి 400 ఏళ్ల చరిత్ర..

నిర్మల్ జిల్లా కేంద్రంలోని షేక్ సాహెబ్‌పేటలో ఏర్పాటు చేసిన ‘పెద్ద మౌలాలి’ పీరికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. షేక్ అజీమ్ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి ఈ పీరిని కాలినడకన తీసుకొచ్చి షేక్ సాహెబ్ పేటలో ప్రతిష్ఠించినట్లు ఆయన వారసులు తెలిపారు.

25 ఏళ్లుగా..


పీరీల పండుగను 25 ఏళ్లుగా భక్తి శ్రద్ధలతో అట్టహాసంగా నిర్వహిస్తున్నాం. పది రోజులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తాం. మా ఆధ్వర్యంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాం. ఆదివారం పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తాం.
– షేక్ అన్వర్, షేక్ సాహెబ్‌పేట్, నిర్మల్

ప్రతీఇంటికి స్వచ్ఛమైన తాగునీరు

- మంత్రి సీతక్క

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు.హైదరాబాద్ నుంచి అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శానిటేషన్, మిషన్ భగీరథ, వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల నివారణ వంటి కీలక అంశాలపై సమీక్షించారు. నీటి సరఫరాలో ఆటంకం ఉంటే పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతీ గ్రామంలో శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తడి-పొడి చెత్త వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించాలన్నారు. వనమహోత్సవం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో నీటి సరఫరా, శానిటేషన్, మొక్కల నాటే కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ పనుల పురోగతిపై ప్రతీవారం నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ గ్రామంలో శానిటేషన్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, మొక్కల సంరక్షణకు గ్రామస్థాయిలో బాధ్యతలు అప్పగించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో నాగవర్ధన్, అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్, అధికారులు

మా ఇంటి నిర్మాణం ఎందుకు ఆపుతున్నావ్..?

- మున్సిపల్ కమిషనర్‌ను నిలదీసిన మహిళ


కమిషనర్‌ను నిలదీస్తున్న బాధితురాలు లక్ష్మి

నిర్మల్‌టౌన్: ‘అన్ని అనుమతులు తీసుకున్న తర్వాత కూడా మా ఇంటి నిర్మాణాన్ని ఎందుకు అడ్డుకుంటున్నావ్.. తన వ్యతిరేకులతో కుమ్మక్కై తన ఇంటి పిల్లర్ కూల్చివేయించావ్’ అంటూ పట్టణానికి చెందిన ఓ మహిళ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను శనివారం నిలదీసింది. ఇంటి పిల్లర్ కూల్చివేయడంతో నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన కురన్నపేట్‌కు చెందిన మహిళ మారంపల్లి లక్ష్మి.. ఏకంగా కమిషనర్‌నే ప్రశ్నించింది. అన్ని పర్మిషన్‌లు తీసుకున్నా పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించింది. ఎలాంటి ఆర్డర్ కాపీ లేకుండా శనివారం తన ఇంటి పిల్లర్ కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్డర్ కాపీ చూపించాలని అడిగినా చూపించలేదని తెలిపింది. మూడేళ్ల క్రితం ప్లాట్ కొనుక్కుని ఇంటి నిర్మాణం ప్రారంభిస్తే తరచూ అడ్డుకుంటూ ఆర్థికంగా నష్టం చేస్తున్నారని కన్నీరు పెట్టుకుంది. పైఅధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. చుట్టుపక్కల వారినుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, నిర్మాణం ఆపాలని ఎన్నిసార్లు సూచించినా లక్ష్మి పట్టించుకోవడం లేదని తెలిపారు. కోర్టు తీర్పు తర్వాత నిర్మించుకోవాలని తెలిపినా లెక్కచేయడం లేదని పేర్కొన్నారు.

‘కడెం’కు స్వల్పంగా ఇన్‌ఫ్లో


కొత్త నీటితో కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్టుకు శనివారం స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చిందని అధికారులు తెలిపారు. 1,466 క్యూసెక్కుల వరద వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 685.325 అడుగుల నీటిమట్టం ఉంది.

బాధ్యతగా మొక్కలు నాటాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్


మొక్క నాటుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ పార్కులో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులు, మహిళలు, కాలనీ వాసులతో కలిసి కలెక్టర్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కల సంరక్షణ కోసం ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని, క్రమం తప్పకుండా నీరు పోసి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భాగ్యనగర్, శాంతినగర్ ప్రాంతాల్లోని పార్కులను కలెక్టర్ పరిశీలించారు. ఉపయోగించని పార్కులను అభివృద్ధి చేసి పచ్చదనం పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో పి.రామారావు, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, మెప్మా పీడీ సుభాష్, ఉపాధ్యాయులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

జిల్లాకు ఐదు కొత్త పాఠశాలలు

నిర్మల్ రూరల్: ప్రజలకు విద్యను మరింత చేరువ చేసేదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పట్టణాలు, గ్రామాల్లోని శివారు కాలనీల్లో 20 మంది విద్యార్థులు ఉంటే... అక్కడ పాఠశాల ప్రారంభించాలని నిర్ణయించింది. ఇటీవల హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోగా, తాజాగా పాఠశాల విద్యా డైరెక్టర్ కొత్త పాఠశాలల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు లేని ఆవాసాలు, కనీసం 20 మంది విద్యార్థులు అంతకుమించి ఉన్నచోట బడులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో కొత్తగా 5 పాఠశాలలు మంజూరయ్యాయి. జిల్లా కేంద్రంలో 3, ఖానాపూర్, భైంసా పట్టణాలకు ఒక్కో పాఠశాల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడ, ఎల్లపెల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద, కుమురంభీం ఎక్స్‌రోడ్ వద్ద గల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో కొత్త పాఠశాలలు ప్రారంభిస్తారు. భైంసాలోని బాబల్గాం, ఖానాపూర్‌లోని రంగాపేట్‌లోనూ ఈనూతన పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. ఈ విద్యాసంవత్సరమే ప్రవేశాలు చేపట్టి విద్యాబోధన చేయనున్నారు. ఫర్నిచర్, విద్యాసామగ్రికి బడ్జెట్‌ను కలెక్టర్ ద్వారా సమకూర్చుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం పీఈటీ

వేమనపల్లి: మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని నీల్వాయి జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గిరిధర్ రెడ్డి, పీఈటీ దాసరి మల్లేశ్ తెలిపారు. వశాక రజిత, అల్వియ మహివీన్, చింతల మహేశ్వరి, కొట్రంగి అనూష సత్తాచాటారు. హన్మకొండలో జవహర్‌లాల్ స్టేడియంలో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కొత్త ప్లాంట్ నిర్మాణ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్: 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా నూతనంగా నిర్మించనున్న మూడో యూనిట్ (800మెగావాట్లు) థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులపై సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు శనివారం అడ్మిన్ భవన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిని అధికారులు వివరించారు. నిర్దేశిత గడువులోపు పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సింగరేణి ఉద్యోగి, ఉత్తమ జ్యోతిష్య, జాతీయ ప్రతిభ రత్న, బంగారు నంది అవార్డు గ్రహీత డాక్టర్ దూళిపాళ్ల మల్లికార్జునశర్మను అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జ్యోతిష్యంపై మక్కువతో మల్లికార్జునశర్మ బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి జ్యోతిష్యశాస్త్రంలో గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. సాయంత్రం 5గంటలకు సంస్థ సీఎండీ బలరాం థర్మల్ పవర్ ప్లాంట్, సోలార్ ప్లాంట్ల విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకత మీద నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎంలు శ్రీనివాసులు, నరసింహారావు, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏఐటీయూసీ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ సెక్రటరీ సంతోష్‌కుమార్, ఏజీఎంలు మురళీధర్, మదన్‌మోహన్, డీజీఎం కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేబిస్‌తో జాగ్రత్త

- పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం
- సీజన్‌కు అనుగుణంగా టీకాలు తప్పనిసరి
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



జిల్లా పశువైద్యాధికారి ఈ.శంకర్

మంచిర్యాలఅగ్రికల్చర్: కుక్కలు, పశువులు, కోళ్లు, పక్షుల నుంచి మనుషులకు సక్రమించేవి జూనోసిస్ వ్యాధులు అంటారు. పశువుల పాకల అపరిశుభ్రత, తదితర కారణాల వల్ల సుమారు 200 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధులపై పశుపోషకులు, జంతు ప్రేమికులు అప్రమత్తంగా ఉండాలి. దీనిపై అవగాహన కల్పించి, ఆ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి శంకర్ పేర్కొంటున్నారు. పశువుల కాపర్లు, పశువైద్యులు, కుక్కలు, పక్షులు పెంచేవారు, పశువుల డెయిరీ ఫాంలో పనిచేసే వారు అప్రమత్తంగా ఉండాలి. పెంపుడు కుక్కలను పెంచడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. శుచి, శుభ్రత పాటించడం ఈ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.

ఇదే రోజు ఎందుకు?

1885 జూలై 6న లూయిస్ ప్యాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి మొదటిసారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తారు.



పెంపుడు కుక్క ల్యాబ్‌బ్రాడర్

పిచ్చికుక్క కాటుతో..

పిచ్చికుక్కకాటు వల్ల పశువులు, కుక్క కరిచిన మనుషులకు రేబిస్ సోకుతుంది. ఈ వ్యాధి ప్రాణాంతకమైనది. పిల్లులు, ముంగిసలు, నక్కలు, తోడేళ్లు తదితర జంతువుల ద్వారా చిట్టెలుక నుంచి ఏనుగు వరకు అన్ని క్షీరదాలకు ఈ వ్యాధి సోకుతుంది. కుక్క కరిచిన తర్వాత 2 నుంచి 3 వారాల తర్వాత వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి 5 నుంచి 6 నెలల తర్వాత బయటపడుతాయి. కుక్కల ద్వారా గజ్జి వంటి చర్మ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో పిచ్చికుక్కకాటుకు గురై పశువులు, మనుషులు మృత్యుబారిన పడుతుంటారు.

అంత్రాక్స్- బ్రూసెల్లోసిస్

పశువుల నుంచి మనుషులకు దొమ్మ(అంత్రాక్స్), బ్రూసెల్లోసిస్ తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. సరిగా వైద్యం చేయిస్తే వ్యాధిని అరికట్టవచ్చు. దీని నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయి. కలుషితమైన పాలు తాగితే క్షయ సోకుతుంది. పందులు, కొంగలు నివాస ప్రాంతాలకు చేరువలో ఉన్నప్పుడు మనుషులు వీటి ద్వారా కూడా మెదడు వాపు సోకవచ్చు. పందులు, దోమలను అరికడితే ఈ వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చు.

పెంపుడు కుక్కలకు ప్రతీఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) ఇప్పిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చు. సీజన్‌కు అనుగుణంగా పశువులు, పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకా సకాలంలో వేయించాలి. పెంపుడు కుక్కలకు మొదటిసారి 30వ రోజు, బూస్టర్ డోసు 90వ రోజు టీకాలు వేయించాలి.

సకాలంలో టీకాలు వేయించాలి

వ్యాధులు సోకిన జంతువులు, కోళ్ల మాంసాన్ని సరిగా ఉడకని గుడ్డు తినవద్దు. చెడిపోయిన, అపరిశుభ్రంగా ఉన్న పాలు, మాంసం, గుడ్లు ఆహారంగా తీసుకోవద్దు. వ్యాధి సోకిన పశువుల పాలు తాగవద్దు. పాడి పశువులు, జంతువుల పాకలను శుభ్రంగా ఉంచాలి. కాలానికనుగుణంగా పశువులు, జంతువులు, పక్షులు, కోళ్లకు రోగ నిరోధక టీకాలు వేయించాలి. చనిపోయిన పశువులు, జంతువులను దూరప్రాంతాల్లో లోతైన గోతిలో సున్నంచల్లి పూడ్చి పెట్టాలి.

పాలిటెక్నిక్ సీట్లకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో యాజమాన్యం కోటా సీట్లు భర్తీ చేశారు. శనివారం కౌన్సెలింగ్‌కు కంపెనీ ఉద్యోగుల పిల్లలు, రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలు హాజరయ్యారు. మొత్తం సీట్లలో యాజమాన్యం కోటా కింద సగం సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. ప్రతీ కోర్సుల్లో 30 సీట్ల చొప్పున 150 సీట్లు ఉండగా, కౌన్సెలింగ్‌లో 84 మంది విద్యార్థులు సీట్లు పొందారు. మొదటి సీటును 1,445 ర్యాంకు సాధించిన ఈ.సుజల్ అనే విద్యార్థి కంప్యూటర్స్‌లో సీటు పొందగా, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌రావు ఆయనకు అడ్మిషన్ అందించారు. మిగిలిన సీట్లలో.. సివిల్‌లో 26, కంప్యూటర్స్‌లో 01, ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 5, మెకానికల్‌లో 24, మైనింగ్‌లో 10 సీట్లను త్వరలో స్పాట్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్, హెచ్‌ఓడీలు జి.దామోదర్, జి.రవీందర్, నరసింహాస్వామి, శ్యామల, కె.సుమన్ పాల్గొన్నారు.



అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు

చోరీ సామగ్రిని తిరిగి వదిలిన ఆగంతకులు

బెల్లంపల్లి: మండలంలోని గురిజాల రైతువేదిక నుంచి అపహరించుకు వెళ్లిన సామగ్రిని ఆగంతకులు తిరిగి అక్కడే వదిలివెళ్లారు. గురువారం రాత్రి రైతు వేదిక తాళం పగులగొట్టి అందులో సామగ్రిని పట్టుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై వ్యవసాయ అధికారులు తాళ్లగురిజాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సామగ్రిని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు 24 గంటల వ్యవధిలో శుక్రవారం రాత్రి ఆ రైతు వేదిక వద్ద తీసుకువచ్చి వదిలివెళ్లారు. బెల్లంపల్లి ఏడీఏ రాజా నరేందర్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్.రమేశ్, ఏవో ప్రేమ్‌కుమార్ శనివారం ఉదయం అక్కడికి చేరుకుని చోరీకి గురైన సామగ్రిని పరిశీలించారు. ఈ ఘటనపై తదుపరి విచారణ చేస్తామని వ్యవసాయ, పోలీసు అధికారులు తెలిపారు.



గురిజాల రైతువేదిక వద్ద వదిలివెళ్లిన సామగ్రి

అర్ధరాత్రి కూడా విధుల్లోనే..



మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

లక్ష్మణచాంద: మండల కేంద్రం నుంచి పీచర మధ్యలో 11 కేవీ విద్యుత్ లైన్ సమస్య ఏర్పడి శుక్రవారం అర్ధరాత్రి సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు ఫోన్ చేయడంతో స్పందించిన విద్యుత్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. స్తంభం ఎక్కి మరమ్మతు చేసి సరఫరాను పునరుద్ధరించారు. అర్ధరాత్రి వేళ సిబ్బంది విధులు నిర్వర్తించి విద్యుత్ లైన్ సమస్య పరిష్కరించారు. ఏఈ మహేశ్ వారిని అభినందించారు. ఇందులో సబ్ ఇంజినీర్ తిరుపతి, ఏఎల్‌ఎం తిరుపతి, జేఎల్‌ఎం చంద్రశేఖర్, నర్సయ్య తదితరులు ఉన్నారు.


చికిత్స పొందుతూ మహిళ మృతి

సోన్: పురుగుల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాదాపూర్‌కు చెందిన సల్ల భోజవ్వ (54)కు కుమారుడు నరేశ్ ఉన్నారు. నరేశ్‌కు పెళ్లి చేసింది. పదేళ్ల క్రితం భర్త నరేశ్‌తో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో భోజవ్వ బాధపడుతుండేది. కోడలు రావడం లేదని మనస్తాపం చెందిన ఆమె శుక్రవారం సాయంత్రం ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. కుమారుడు నరేశ్ గమనించి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కుమారుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు.

మహిళలను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అనీస్ రైల్వేస్టేషన్ ఎదుట నుంచి వెళ్తున్న మహిళలు, యువతులను వేధింపులకు గురి చేస్తున్నాడని తెలిపారు. పలువురు షీ టీంకు సమాచారం అందించగా.. అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు భర్త ఆత్మహత్య



వెంకటేశ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: మద్యం తాగొద్దని భార్య మందలించడంతో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దివాకర్, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ఒల్లెపు వెంకటేశ్(40), సుజాత దంపతులు. వీరికి కుమారుడు గణేశ్, కూతుళ్లు బిందు, దివ్య ఉన్నారు. కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవారు. వెంకటేశ్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి రావడంతో తరచూ గొడవలు జరిగేవి. ఎదిగిన పిల్లలు ఉన్నారని, మద్యం తాగుడు మానేయాలని భార్య మందలించడంతో వెంకటేశ్ మనస్తాపం చెందాడు. శుక్రవారం ఎఫ్ సీఐ గోదాము వెనుకాల మద్యం మత్తులో పురుగుల మందు తాగి చనిపోతున్నానని కుటుంబీకులకు ఫోన్‌చేసి చెప్పాడు. వారు అక్కడికి చేరుకుని అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదం.. పశువుల యజమానిపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు ప్రమాదానికి కారణమైన పశువుల యజమానిపై హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం .. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నర్సింగాపూర్‌కు చెందిన ఏనుగు జయపాల్‌రెడ్డి శనివారం ఉదయం కారులో మంచిర్యాల నుంచి నర్సింగాపూర్‌కు వెళ్తున్నాడు. వేంపల్లిలో జాతీయ రహదారిపై ఒక్కసారిగా మూడు బర్రెలు అడ్డు వచ్చాయి. దీంతో కారు బర్రెలను ఢీకొట్టి ధ్వంసం కాగా.. జయపాల్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. మూడు బర్రెలు మృతిచెందాయి. పశువులను ఇంటి వద్ద, కొట్టంలో ఉంచాల్సి ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాత మంచిర్యాల జ్యోతినగర్‌కు చెందిన పశువుల యజమాని కార్ల మల్లేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లేశ్‌ను అదుపులోకి తీసుకుని నోటీసులు జారీ చేశామని ఎస్సై తెలిపారు. పశువులను యజమానులు ఇళ్లు, కొట్టాల్లో కాకుండా రహదారులపైకి వదిలి ఇతరుల ప్రాణాలకు హాని కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

12న చెట్ల తొలగింపునకు వేలం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్) వరకు (హైదరాబాద్-కరీంనగర్-చాందా రోడ్డు 251/9 నుంచి 255/7 కిలోమీటర్లు) విస్తరణలో భాగంగా ఇరువైపులా 63 చెట్ల తొలగింపునకు ఈనెల 12న వేలం పాట నిర్వహిస్తున్నట్లు రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

రామకృష్ణాపూర్: అనుమతులు లేకుండా ఇష్టానురీతిన వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యుడు వనం సత్యం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది ఆర్‌ఎంపీలు ఇష్టారీతిన వైద్యం చేస్తున్నారన్నారు. ఆర్‌కేపీలో ఓ ఆర్‌ఎంపీ నిర్లక్ష్యం కారణంగానే శ్రీనాథ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు ఇంజక్షన్ వికటించి మృతిచెందాడని అన్నారు. ఆ వైద్యుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడి పక్షాన కాకుండా స్థానిక కొంతమంది నాయకులు ఆర్‌ఎంపీ పక్షాన నిలుస్తూ సెటిల్‌మెంట్లకు యత్నించడం బాధాకరమన్నారు. యువకుడి ప్రాణాన్ని రూ.2 లక్షలకు విలువ కట్టడం ఏమిటని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, నక్క వెంకటస్వామి, సాంబయ్య, పాల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీపత్రాలు సృష్టిస్తున్న ముఠా గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- తండ్రి అరెస్ట్, పరారీలో కుమారుడు
- కంప్యూటర్, స్కానర్, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం
- వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ప్రభుత్వ శాఖల నకిలీపత్రాలు, స్టాంపులు, అధికారుల సంతకాల స్టాంపులు సృష్టించే ముఠాను ఆదిలాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. డాక్యుమెంట్ రైటర్ ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్న తండ్రి, కుమారుడిపై కేసు నమోదు చేశారు. తండ్రిని అరెస్ట్ చేయగా కుమారుడు పరారీలో ఉన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన లాడ్వే బద్రినాథ్ కుమారుడు రాహుల్‌కుమార్. ఇతను డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. గత మూడేళ్లుగా తండ్రి కుమారుడు నకిలీపత్రాలు, స్టాంపులు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నట్లు ఫిర్యాదు అందింది. పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి వారి ఇంటిపై పోలీసులు దాడి చేశారు. వివిధ జిల్లాల్లో శాఖల అధికారుల సంతకాలతో కూడిన స్టాంపులు, పత్రాలు, వాటిని తయారుచేసే రసాయనాలు, పరికరాలు, కంప్యూటర్, స్కానర్, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నకిలీ పత్రాలతో అక్రమాలు

మావల మండలంలోని సర్వేనంబర్ 170లోని ప్లాట్ల పత్రాలను మండల రెవెన్యూ అధికారి కేటాయించినట్లుగా సృష్టించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ నకిలీపత్రాలు, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన, ఆర్టీవో వాహన రిలీజ్ పత్రాలు, ఆధార్‌కార్డుల తోపాటు వివాహ సర్టిఫికెట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడ్డారు. వివిధ హాస్పిటల్స్‌కు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి ప్రభుత్వం ద్వారా కొంతమందికి విక్రయించి లబ్ధిని పొందేలా చూశారు. మహాలక్ష్మి మాన్‌పవర్ అండ్ ప్లేస్మెంట్స్ సర్వీసెస్ అనే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నకిలీ ఉద్యోగ నియామకపత్రాలు తయారు చేసి మోసగించారు. నకిలీ పత్రాలతో ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా పోలీస్ బృందాలు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ ముఠా గుట్టు రట్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వన్‌టౌన్ సీఐ బి.సునీల్ కుమార్‌లను అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ బి.సునీల్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ డాక్యుమెంట్లు, పట్టాలు

నేడు తొలి ఏకాదశి

- చాతుర్మాస్య వ్రతాలు ప్రారంభం
- కిటకిటలాడనున్న ఆలయాలు

చెన్నూర్: తొలి ఏకాదశి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఆషాఢశుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. సంవత్సరం మొత్తంలో 24 ఏకాదశులు ప్రతినెల కృష్ణపక్షంలో ఒకటి, శుక్లపక్షంలో ఒకటి మొత్తం రెండు ఏకాదశులు వస్తాయి. ఆదివారం తొలి ఏకాదశి పండగ నుంచే చాతుర్మాస్య వ్రతాలు ప్రారంభమవుతాయి. ఆషాఢ శుక్ల పక్షం నుంచి కార్తీక శుక్లపక్షం వరకు చాతుర్మాస్య దీక్షలు చేయడం అనవాయితీగా వస్తుంది. తొలి ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగా నిద్రకు ఉపక్రమిస్తారు. దీన్ని శయన ఏకాదశి అని పిలుస్తారు. నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి మేల్కొంటారు. ఈ నాలుగు నెలల కాలాన్ని ప్రజలు పవిత్ర నెలలుగా భావించి చాతుర్మాస్య దీక్షలు చేస్తారు.

పండగ విశిష్టత..

భక్తులు సూర్యోదయానికి ముందే గోదావరినదిలో స్నానాలు ఆచరించి మహావిష్ణువు ఆలయాలను సందర్శించి పూజలు చేస్తారు. చాతుర్మాసం ప్రారంభం కానుండడంతో శ్రీ మహావిష్ణువు ఆలయాలు కిటకిటలాడుతాయి. తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి తర్వాత రోజు మహావిష్ణువును పూజించి నైవేద్యం సమర్పించి భోజనం చేస్తారు.



చెన్నూర్ జగన్నాథాలయం

వ్రతాలు ఆచరించాలి



తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస్య వ్రతాలు ఆచరించాలి. శ్రీమహావిష్ణువు యోగా నిద్రకు ఉపక్రమించే రోజు కావడంతో తొలి ఏకాదశి రోజున ఉపవాసం చేసి మహావిష్ణువు పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. – వేమారం మహేశ్వర్‌శర్మ, అర్చకుడు, శివాలయం

భూకబ్జాకు పాల్పడిన 9 మందిపై కేసు

- ఐదుగురి అరెస్ట్, పరారీలో నలుగురు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: భూమి పత్రాలను ఫోర్జరీ చేసి, ప్లాట్లను కబ్జా చేసి డబ్బులు డిమాండ్ చేస్తూ యజమానులను బెదిరించిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. మావల పోలీసుస్టేషన్‌లో శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని భుక్తపూర్ కాలనీకి చెందిన జనకొండ పోసాని 2009లో ఖానాపూర్ శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 68/44/1లో 30, 38 నంబర్ గల రెండు ప్లాట్లు కొనుగోలు చేశారు. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పైక్ రావు ఆనంద్ (మాజీ కౌన్సిలర్ కుమారుడు), సద్దాం హుస్సేన్, షేక్ షాదుల్లా, బోడకుంట రాజు, అజీముద్దీన్, సంతోష్, మనోహర్, షాబానా బేగం, హీనా అంజుమ్‌లు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ ప్లాట్లను కబ్జా చేశారు. మున్సిపల్ అధికారులను మోసం చేసి ఇంటి నంబర్లు పొందారు. దీంతో బాధితురాలు ఈనెల 3న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శుక్రవారం ఐదుగురు నిందితులు పైక్ రావు ఆనంద్, సద్దాం, షేక్ షాదుల్లా, బోడకుంట్ల రాజు, షేక్ అజీముద్దీన్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగతా నలుగురు సంతోష్, మనోహర్, షాబానా బేగం, హీనా అంజుమ్‌లు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అరెస్టైన వారిని 15 రోజుల రిమాండ్‌కు తరలించారు. ప్లాట్ ఇంటి నంబర్లకు సహకరించిన మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, రెవెన్యూ ఆఫీసర్ జాదవ్ కృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మావల సీఐ కర్రె స్వామి, ఎస్సై ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ ఆర్.ప్రకాశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో శనివారం రాత్రి కార్డన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకుండా ఎలాంటి పత్రాలు లేని 30 బైక్‌లు, బెల్ట్ షాపుల వద్ద నుంచి సుమారు రూ.10 వేల విలువ గల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో కౌన్సెలింగ్ ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీలో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఏర్పాట్లపై అధికారులతో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో ఈనెల 7, 8, 9 తేదీల్లో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అడ్మిషన్ల కన్వీనర్ చంద్రశేఖర్, కోకన్వీనర్ దేవరాజు, బండి హరికృష్ణ, అడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.